గేదె ఈనితే సంతోషపడినవాడు భార్య ప్రసవిస్తే మూతి ముడుచుకున్నాడెందుకని?

కె.బి.ఎస్. కుమార్ కథ

# శుభవార్త

బెంచీపై చతికిలపడ్డాను. నిట్టూరుస్తూ.

అది పార్కు.

అయినా పక్షుల కిలకిలారావాలు గానీ ప్రేమ జంటల పరిమళాలుగాని లేవు. కారణం అది మధ్యాహ్న సమయం.


ఎండమండిపోతోంది. అంతకుమించి నా గుండె మండిపోతోంది. దాదాపు అరగంటనుండి నాకు విపరీతంగా దాహం వేస్తోంది. అయినా మంచినీళ్ళు తాగాలన్న ఊహ రాలేదు.

కారణం ఇవాళ నాకొచ్చిన ఉత్తరం.

శ్రీముఖితో నా వివాహం జరిగి మూడేళ్ళు కావస్తోంది. అనురాగానికి ప్రతిరూపం శ్రీముఖి. ఆప్యాయతకి ప్రతిబింబం శ్రీముఖి. శ్రీముఖి తోడుంటే నేను సప్త సముద్రాలు సైతం దాటగలను. ఆమెతో వైవాహిక జీవితం నా పూర్వజన్మ సుకృతం. ఈ మాటనడానికి నేను సిగ్గుపడను.

మేం లక్షాధికార్లం కాకపోయినా మాదీ కలిగిన కుటుంబమే. సిండికేట్ బ్యాంకులో నెలకు పదహారు వందలు జీతం తీసుకునే ఉద్యోగం చేస్తున్నాను. నాకో మోపెడ్ ఉంది. శ్రీముఖితో దానిపై తిరగాలంటే ఎంతో సరదా నాకు.

మూడు సంవత్సరాల క్రితం బస్టాపులో శ్రీముఖితో పరిచయం లభించింది. అది ప్రేమగా మారడానికి మూడు మాసాలు మించి పట్టలేదు. మా నాన్న, అమ్మ నా మాట కెదురుచెప్పని రకాలు కావడంతో మా వివాహం జరిగిపోయింది.



మా స్వంతూరు ఈ ఊరికి ముప్ఫయి కిలోమీటర్లు దూరంలో ఉండే ఓ పల్లె., అక్కడ మాకు పొలాలున్నాయి. వ్యవసాయం ఉంది. పదిహేను గేదెలున్నాయి.

పెళ్ళయిన కొత్తలో చీటికీ మాటికీ అమ్మానాన్నా పనిగట్టుకుని వచ్చేవారు. వచ్చేటప్పుడు ఏ సున్నుండలో పట్టు కొచ్చేవారు.

నాకు విసుగన్పించేది. విశేషేమిటంటే పదిహేను పైసల కార్డుముక్కతో పోయేదానికి వీళ్ళింత హడావుడి ఎందుకు చెయ్యాలి? పైగా వాళ్ళ రాక వల్ల మా ఏకాంతానికి భంగం కల్గేది.

సరదాగా ఏ సినిమాకో షికారుకో పోవాలని తయారై తీరా కదలబోయేంతలో నాన్న ఊడిపడేవాడు. ఉత్సాహమంతా నీరుగారి పోయేది. శ్రీముఖి వారిస్తున్నా విన్పించుకునే వాణ్ణిగాదు. నా అసహనాన్ని ఏదోవిధంగా బైటపెట్టేవాడిని.

పిచ్చినాన్న! అదంతా పట్టించుకునేవాడు కాదు. శ్రీముఖి చాటుగా మందలించేది. ఆమెని బిగి కౌగిట బంధించి ఏదో అనేసే వాడిని.

ఇలా అయితే లాభం లేదని ఓ ఆంక్ష పెట్టేశాను. అమ్మానాన్నా ఎవ్వరూ ఈ ఊరికి రావాల్సిన పన్లేదు. నెలకోసారి నేనూ శ్రీముఖీ మా ఊరు వెడతాం. ఆ రోజంతా అక్కడే ఉండి మర్రోజు బ్యాంక్ సమయానికి ఈ ఊరు చేరుకుంటాం.

అమ్మానాన్నలకి ఈ ఒప్పందం నచ్చిందో లేదోగాని మొత్తం మీద ఒప్పేసుకున్నారు.

నెలకోసారి మేం వెళ్ళొచ్చే వాళ్ళం. ఆతర్వాత పదిరోజులకి అమ్మనుండి ఉత్తరం వచ్చేది. అందులో శ్రీముఖి ఆరోగ్యం గురించి బోలెడు జాగ్రత్తలుండేవి. మరో పదిరోజులకీ నాన్న రాసే వాడు. మళ్ళా పది రోజులకి మేం వెళ్ళాల్సిన రోజు వచ్చేది.

శ్రీముఖికి నెల తప్పిందని తెల్సినరోజు నా ఆనందం వర్ణనాతీతం. ఆమెని ఎత్తుకుని గాల్లో గిరగిరా తిప్పేశాను. మామిడికాయలు తెప్పించాలా అని అడిగాను. ఉంగరం చేయించనా గాజులు చేయించనా అని ప్రశ్నించాను.

"ఈ విషయం అత్తయ్యకీ మావయ్యకీ రాయండి చాలు" అంది శ్రీముఖి.

అప్పటినుండి మరింత అపురూపంగా చూసుకునేవాడిని. రకరకాల పులుపు పదార్థాలు ప్రత్యేకంగా అమర్చేవాడిని. నా కొలీగ్స్‌ని పిల్చి 'ఎస్కేపీ' కూడా అరేంజ్ చేశాను.

శ్రీముఖి నిరుపేద కుటుంబంలోంచి వచ్చినపిల్ల. ఆమెని ఇంటర్ చదివించేసరికే వాళ్ళ ఓపిక వగైరాలు హారతి కర్పూరమయ్యాయి. పైగా వాళ్ళది విజయనగరం. ఇక్కడకొచ్చి దూరపు బంధువుల సాయంతో హాస్టల్లో చేరి బియ్యే పూర్తిచేసింది.

ఇప్పుడు శ్రీముఖి నెలతప్పిన విషయం వాళ్ళకి రాసినా అక్కడినుండే సంతోషించగలరు కానీ ఇక్కడికొచ్చి అమ్మాయిని పిల్చుకుపోయి సీమంతం చెయ్యడానికిక్కాని, డెలివరీకి పిల్చుకుపోవ

పిల్చుకుపోవడానిక్కాని కనీసం చూసిపోయేందుకైనా గానీ, సుముఖత చూపించలేదు. ఇందుక్కారణం కేవలం ఆర్థిక బలహీనతేగాని మరేమీ కాదు.

పోనీ పైకం మనం పంపుదాం అంటే శ్రీముఖి అంగీకరించదు. ఒక్క మాటలో చెప్పాలంటే అది నాకూ అయిష్టమైన పనే.

ఎందుకంటే నేను శ్రీముఖిని మాత్రమే ప్రేమించాను. శ్రీముఖి

వాడికావచ్చుగాని శ్రీముఖి వాళ్ళందర్నీ నా వాళ్ళుగా నేను భరించలేను.

అంచాత 'సీమంతం' మేమే చెయ్యాలనుకున్నాం.

మా పల్లెలో చేద్దామని అమ్మా నాన్న. నేనేమో ఈ ఊళ్ళో చెయ్యాలని పట్టు బట్టాను. దాదాపు గంటసేపు ఉద్రేకంలేని వాగ్యుద్ధం జరిగింది. నేనే గెలిచాను.

ఆరోజు మా ఇంటిని రంగు కాయితాలలో నేనే అలంకరించాను. పదకొండు రకాల తీపి పదార్థాలతో పిండివంటలు చేసింది అమ్మ. పగలంతా ఆఫీసుకి సెలవుపెట్టి శ్రీముఖితో తీయని కబుర్లు చెబుతూండిపోయానా రోజు. తలంటి పోసుకున్న శ్రీముఖి కురులనే చూస్తూ.

సాయంత్రం పేరంటం జరిగింది. ఇరుగుపొరుగు అమ్మలక్కలూ నా కొలీగ్స్ స్నేహితుల తాలూకు ఆడవాళ్ళతో కిటకిటలాడింది మా ఇల్లు.

కొత్త పట్టుచీర కట్టుకుని పీటపై నునులేత సిగ్గులతో మల్లెమొగ్గలా కూర్చుంది శ్రీముఖి. మాతృత్వం తాలూకు ఆనందరేఖలు వెలుగురేఖల్లా ఆమె మొహంపై అప్పుడే దోబూచులాడుతున్నాయి.

నిండుముత్తయిదువలు పండు హృదయంతో ఆశీర్వదిస్తోంటే శ్రీముఖి ఈడు అమ్మాయిలు చిలిపి మాటలతో కవ్విస్తున్నారు. అప్పుడు శ్రీముఖి బుగ్గలు నారింజవర్ణంలోకి తిరుగుతున్నాయి.


తృప్తితో నా హృదయం పొంగిపోయింది.

తీపి పదార్థాలన్నీ శ్రీముఖి చేత తాకించారు. వచ్చిన వాళ్ళందరికీ పంచిపెట్టారు.

మూరు భాగాల నిండుతనంతో ఆ వేడుక జరిగిపోయింది.

ఆ రాత్రి శ్రీముఖి నా కౌగిట్లో గువ్వలా ఒదిగిపోయింది.

ఆ తర్వాత నాలుగు నెలలు నాలుగు నిమిషాల్లా తప్పుకున్నాయి.



డెలివరీ కూడ మేమే చెయ్యాలనుకున్నాం. ఈ విషయంలో కూడా అమ్మా నాన్నలకూ నాకూ మధ్య అప్పట్లాంటి వాగ్యుద్ధమే జరిగింది. అయితే ఈ సారి గెలుపు వాళ్ళది.

"పల్లెటూళ్ళో అయితే డెలివరీక్కావాల్సిన సదుపాయాలుండవు. అదే ఇక్కడయితేనా?" అనే వాక్యంతో గెలవబోయి ఓడిపోయాను.

"ఏడిశావులేవోయ్... నువ్వాస్పత్రిలో పుట్టావా? ఇంటిదగ్గరే కాదూ!!!?" అన్నాడు నాన్న.

ఆ ఊళ్ళో ఎవరో చెయ్యితిరిగిన మాంత్రసానుందిట. ఆవిడ చేతుల్లో ఒక కేసుకూడా ఫెయిలవలేదుట.

ఇంకేమనగలనూ!!?

తొమ్మిదో నెల రాగానే అమ్మానాన్న వచ్చి శ్రీముఖిని తీసికెళ్ళారు.

అప్పటినుండి నా ప్రోగ్రాములో మార్పొచ్చింది.

ప్రతి ఆదివారమూ మా ఊరు వెడుతున్నాను. శ్రీముఖిని పరామర్శించి వస్తున్నాను.

అమ్మ అప్పుడప్పుడూ ఎకసెక్కెపు మాటలంటోంది. నవ్వుతూ భరిస్తున్నాను.

శ్రీముఖి నిన్న ప్రసవించిందట. నాన్న వెంటనే ఉత్తరం రాశాడు.

ఇవాళ బ్యాంకులో పని చేస్తుండగా అందింది, సరిగ్గా అదే సమయంలో నా మస్తిష్కానికి స్పష్టతా అందింది. ఆ ఉత్తరమే దాన్ని మోసుకొచ్చి అందించింది.

గుండెల్లోంచి బాధ, కోపం, కసి — ఒక దాంతో మరోటి పోటీపడుతూ తన్నుకొచ్చాయి.

ఆ బాధని ఎవరితో పంచుకోవాలో తోచలేదు.

ఆ కోపాన్ని ఎలా అణచుకోవాలో బోధపడ్లేదు.

ఆ కసిని ఎవరిపై కుమ్మరించాలో తెలీలేదు.

ఫలితంగా తలపోటు హెచ్చింది. విధి బలమైన సమ్మెటతో అదేపనిగా కణతలపై మోదుతున్నట్లుగా బాధ. కళ్ళ ముందు అకౌంటు పుస్తకంలోని అంకెలూ అక్షరాలూ మసగ్గా కన్పిస్తూ శూన్యంగా మారిపోతున్నాయి. కడుపులో వికారంగా ఉంది. డోకొచ్చేలా ఉంది. నెమ్మదిగా కళ్ళు తిరగ నారంభించాయి.

సెలవురాసిపడేసి మోపెడ్ ఎక్కాను.

ఎక్కడికెళ్ళాలో తోచలేదు.

చేతులు అప్రయత్నంగా పార్కువైపు దారితీశాయి.

మస్తిష్కంలో రగులుతూన్న సంఘర్షణ తాలూకు వేడి ముందు ఎండ తీవ్రత బాధించడంలేదు.

నిండుజాబిలి లాంటి ప్రకాశవంతమైన 'వెలితి' మనసునిండా ఆక్రమించుకుంది.

ఏం పాపం చేశానని నాకు దేవుడు ఇంత శిక్ష విధించాడు? ఏం నేరం చేశానని — నేను — మేము కన్న కలలన్నీ ఇంత నిర్దాక్షిణ్యంగా కూలదోశాడు?

సీమంతం నాడు అంతమంది పండు ముత్తయిదువలు నిండు హృదయంతో ఆశీర్వదించారు. ఆ ఆశీర్వాద ఫలమంతా

ఏమైంది.

ఒక్కసారిగా ఏడుపొచ్చింది.

ఏదైతే జరక్కూడదనుకున్నాడో అదే జరిగింది. భవిష్యత్తంతా శూన్యమైపోయింది.

జేబులోంచి ఉత్తరం తీసి మరోసారి చదుకున్నాను. అదే ఉత్తరం అదే మేటర్ అదే సారాంశం.

ఎన్నిసార్లు చదివినా అదే అదే అదే!!!

మరింత ఏడుపొచ్చింది.

ఇప్పుడావూరికి వెళ్ళాలా మానాలా?

వెళ్ళాలనిపించడంలేదు. కాని వెళ్ళక తప్పదు.

దాహంతో నాలిక పిడచకట్టుకుపోతోంది. నెమ్మదిగా లేచాను. మోపెడ్ స్టార్ట్ చేశాను. సోడా బంక్ వద్దకు వెళ్ళి అయిస్ వేసిన సోడా తాగాను. నేరుగా ఫ్రెండ్ ఇంటికి పోనిచ్చాను. మోపెడ్ అక్కడే పెట్టి వాడితో చెప్పి బస్టాండుకి బయల్దేరాను, నిస్సత్తువగా.

బస్సు రడీగా ఉంది. 'కాస్త ఆలస్యంగా రాకూడదూ!' అని తిట్టుకున్నాను. నన్ను పరీక్షిస్తున్నట్టుగా వెంటనే కదిలింది బస్సు.

బస్సునిండా — అయ్ మీన్ — దారిపొడుగునా ఆలోచన్లే. బస్సుకి అప్పుడప్పుడూ బ్రేకులు పడుతున్నాయి కాని వీటికి మాత్రం పడటంలేదు.

శరవేగంతో ప్రయాణించి అరగంటలో మావూళ్ళో దింపి వెళ్ళిపోయింది బస్సు.

తలొంచుకుని నడుస్తున్నాను. ఎవరెవరో ఎదురొస్తున్నారు. ఎదురొచ్చిన వాళ్ళందరూ పలకరిస్తున్నారు. అలా పలకరించినప్పుడల్లా గిల్టీగా ఫీలవుతున్నాను.

వాళ్ళు నవ్వు మొహంతోనే పలకరిస్తున్నారు. కాని నాకేమో అలా అన్పించడంలేదు. ప్రతి పలకరింపు లోనూ ఏదో అవహేళన — అపశృతిలా వినబడుతోంది.

మౌనంగా ఇంట్లోకి అడుగుపెట్టాను. అమ్మ ఎదురొచ్చింది. కాళ్ళకి నీళ్ళిచ్చింది. ఏదేదో మాట్లాడుతోంది. అవేవీ వినబట్టంలేదు. మౌనంగానే తువ్వాలందుకొని లోపలికి నడిచాను.

శ్రీముఖి గదిలోకి వెళ్ళాలనిపించలేదు. ఆమెను చూడటానికి మనసొప్పలేదు. నిర్వికారంగా నా గదిలోకి నడిచాను. తలుపులు మూసుకొని గొళ్ళెం పెట్టు

## కళ్ళజోడు



పేపర్లో అక్షరాలు కన్పించకపోవటంతో కళ్ళజోడు పెట్టించుకొంది ఆండాళమ్మ

మర్నాడు కళ్ళజోడు పెట్టుకొని పేపర్ చదువుతూ "ఇదేమిట్రా అబ్బాయ్ ఇన్నాళ్ళూ చిన్న అక్షరాలు ప్రింట్ చేసే ఈ పేపర్ వాళ్ళు నేను కళ్ళజోడు పెట్టుకొన్నాక ఇంత పెద్ద అక్షరాలతో ప్రింట్ చేస్తున్నారు. ఈ సంగతి ముందే తెలిసి ఉంటే కళ్ళజోడుకు ఇంత డబ్బు నాశనం చేసేదాన్ని కాదు కదా!" అంటూ వాపోయింది. ఆండాళ్ళమ్మ తన మనమడితో.

—జోకర్ (హైదరాబాద్)

కున్నాను.

మనసు బరువెక్కింది. దీర్ఘంగా నిట్టూరుస్తూ మంచంపై వాలిపోయాను.

...తలుపు దబదబా బాదుతుండటంతో మెలకువొచ్చింది. కళ్ళు బరువుగా మత్తుగా ఉన్నాయి. తల దిమ్ముగా ఉంది.

టైమ్ చూసుకున్నాను. మైగాడ్!! మూడుగంటలసేపు నిద్రపోయానన్నమాట!!

తలుపులు తెరిచాను. ఎదురుగా అమ్మ.

"ఏం కావాలి?" అడిగాను క్లుప్తంగా.

"శ్రీముఖి.."

"ఇక్కడెందుకుంటుంది?"

"అదికాదురా..."

"ఏదికాదు? తన గదిలోనే ఉంటుంది. లేకపోతే బైటెక్కడైనా వెదుకు?!!"

"నువ్వొచ్చి మూడు గంటలైనా తనని పలకరించనందుకు బాధపడుతోంది..."

"అయితే! నన్నేం చెయ్యమంటావ్?"

"ఏడుస్తోందిరా!!"

"గంగలో దూకమను..."

అమ్మగట్టిగా చీవాట్లు పెట్టింది. విసురుగా వెళ్ళిపోయింది. నాకు మరింత కోపంవచ్చింది. వడివడిగా అడుగులేస్తూ శ్రీముఖి గదిలోకి నడిచాను.

ఏడుస్తోన్న శ్రీముఖి కళ్ళు నా అడుగుల సవ్వడి విని నక్షత్రాల్లా మెరిశాయి. ఆ మెరుపులో అశ్రుబిందువులు తళుక్కుమన్నాయి.

"వచ్చారా...?" అంది ఆపుకోలేని ఉద్వేగంతో.

"ఆ నువ్వుచేసిన ఘనకార్యాన్ని విని పరవశించి పోయాను. నీ దర్శన భాగ్యంతో తరిద్దామని— వచ్చాను' అన్నాను వ్యంగ్యంగా.

అదిరిపడింది శ్రీముఖి.

"మీరు... మీరేనా ఈ మాటలంటున్నది?"

"ఛీఛీ.... నా ఆశలన్నీ తల్లకిందులు చేశావ్. నా భవిష్యత్తంతా మంటగలిపావ్. నా కలలన్నీ గంగపాలు చేశావ్..."

"నేనేం చేశానండి!!!" వెక్కుతూ అంది శ్రీముఖి.

నేను మాట్లాడలేదు. కోపం బుసలు కొడుతోంది. ముక్కు పుటాలు కంపిస్తున్నాయి. కసి తీర్చుకోవడం కోసం ఏదో చెయ్యాలని ఆరాటం ఏమీ చెయ్యలేని నిస్సహాయత!!

"... మాట్లాడరేమండీ...?!" వెక్కుతూనే అంది శ్రీముఖి అప్పటికే ఆమె బాగా యేడ్చిఉండాలి. కళ్ళు బాగా ఉబ్బిపోయి ఎర్రగా ఉన్నాయి. ముఖం నీరసంగా ఉంది.

"ఏవండీ! ఒక్కసారి పాపని చూడండి... ఎంత బొద్దుగా వుందో... అచ్చం మీ పోలికే... నేను కాస్త నలుపు కదా! నారంగొస్తుందేమోనని భయపడ్డాను. ఉహూ! రంగులో కూడా మీ పోలికే."

ఇక విన్లేకపోయానా మాటలు. చరచరా ఇవతలికొచ్చేశాను. శ్రీముఖి ఎంత పిలుస్తున్నా విన్పించుకోకుండా.

నా మనసుకి ఊరటకావాలి. అందుకు తాత్కాలికంగా ఏదైనా వ్యాపకం కావాలి. నా క్లాస్‌మేట్ ఈ ఊళ్ళో పశువుల డాక్టర్‌గా పన్జేస్తున్నాడు. అతన్తో కాసేపు జర్నల్

టాపిక్స్ నా మనసుకి ప్రశాంతత చేకూర్చగలదేమో!

కాని నీళ్ళతో గబాగబా మొహం కడుక్కుని కర్చీఫ్‌తో తుడుచుకుంటూనే బయల్దేరాను. పదిగజాల దూరంలో వాడే వస్తూ కన్పించాడు.

పలకరింపులయ్యాక "నీ కోసమే బయల్దేరాను. నువ్వేటు?" అనడిగాను.

"మీ ఇంటికే. మన గేదె ప్రసవించలేకపోతోందని నాన్నగారు చెప్పారు. పద చూద్దాం..." అన్నాడు.

సరేనన్నాను. ఇలాగైనా నాకు కాస్త ఊరట లభించబోతోంది. పైగా వెటెర్నేరియన్ డ్యూటీ నాకు కొత్త సబ్జెక్టు.

ఇద్దరం పశువులశాలకి వెళ్ళాం. మిగతా పశువులు మేత కొరకు బైటికి వెళ్ళాయేమో. అదొక్కటే ఉంది. అమ్మ శ్రీముఖి వద్దకి వెళ్ళిందేమో, నాన్నొక్కడే ఉన్నాడు గేదెవద్ద.

డాక్టర్ని చూడగానే నాన్న మొహం ప్రసన్నంగా మారింది.

గేదె వెల్లకిలా పడిఉంది. కడుపు లావుగా ఉంది. కొద్దిగా ఆయాసంతో రొప్పుతోంది. మర్మావయంలోంచి దూడతల కొద్దిగా బైటికి వచ్చింది.

నాకేమీ అర్థం కాలేదు. డాక్టర్ కేసి చూశాను.

"పశువులకీ, మనుషులకీ ప్రసవించే విధానంలో ఓ తేడా ఉంది. మనుషుల్లో శిశువులు చేతులు వెనక్కి పెట్టుకుని జన్మిస్తే అది సుఖ ప్రసవం. పశువుల్లో శిశువులు — ఐ మీన్ దూడలు — ముందుకాళ్ళు ముందుకి చాపుకుని వాటిపై తలపెట్టుకుని జన్మిస్తే అది సుఖ ప్రసవం. ఇప్పుడీ దూడ ముందుకాళ్ళు రెండూ వెనకపైపుకి వెళ్ళాయి అందుకే ప్రసవం కష్టమవుతోంది. వన్ మినిట్..." అంటూ డెటాల్ వాటర్‌తో చేతులు — మోచేతుల్దాకా శుభ్రంగా కడుక్కుని గేదె వెనక కాళ్ళవద్ద మొకాళ్ళపై కూచుని దూడతలని కుడిచేత్తో మృదువుగా వెనక్కి నెట్టేశాడు భరత్. ఆ తర్వాత జాగ్రత్తగా

## పాము మందు



పనామా దేశంలో అతిభయంకరమైన విష సర్పాలు ఉన్నాయి. అవి కరిస్తే కొద్ది నిముషాలలో మనిషి మరణించటం ఖాయం. అయితే అంతటి విషపూరితమైన సర్పాల విషం గుండె జబ్బులకు, క్యాన్సర్ వ్యాధికీ 'కళ్లెం' వెయ్యగలదనే విషయం అత్యద్భుతం! ఈ విషయాన్ని గుర్తించిన అమెరికా, మెక్సికోలకు చెందిన శాస్త్రవేత్తలు పనామా మంత్రి బ్రూనో గారిన్‌టోతో మొన్నీ మధ్యనే ఒప్పందానికి వచ్చారు.

దీనిప్రకారం పనామాలో దొరికే విషపూరితమైన పాముల్ని పట్టే..వాటి విషాన్ని సేకరించి భవిష్యత్ పరిశోధనలకోసం శాస్త్రవేత్తలకు అందజేస్తారు. చూద్దాం...మరి ఈ పరిశోధనలు ఎలాటి రూపు దిద్దుకుంటాయో!

—జూపిటర్

చేతిని లోపలికి పోనిచ్చి రెండు నిమిషాలు ఏమోచేశాడు. చేతిని వెలుపలికి తీసి మళ్ళీ శుభ్రంగా చెయ్యి కడుక్కున్నాడు.

"ఇప్పుడేం జరుగుతోంది?" ప్రశ్నించాను.

"చూస్తూండు..." అన్నాడు భరత్.

ఈలోగా పాలేరు మా ముగ్గురికీ కాఫీలు సర్వ్ చేశాడు.

కాఫీ త్రాగడం పూర్తయేలోగా మళ్ళీ దూడతల బయటికి రావడం, వెన్వెంటనే మిగతా శరీరమంతా బైటికి రావడం జరిగిపోయింది.

ప్రశంసాపూర్వకంగా భరత్ కేసి చూశాను.

"థాంక్స్‌రా నీ మేలు మర్చిపోలేను. దూడ పుట్టింది. పైగా పెయ్యదూడ!" అన్నాను.

"ఏ దూడ పుట్టినా తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం" అంటూ దూడల పెంపకంపై ఓ చిన్నసైజు ఉపన్యాస మిచ్చాడు భరత్.

అదివింటూ యధాలాపంగా గేదెవైపు చూసిన నేను ఉలిక్కిపడ్డాను.

గేదె ఇంకా బాధపడుతోంది. అప్పటికే భరత్ దూడ బొడ్డు కోసి టించర్ అప్లయ్ చేశాడు. గేదె ఇంకా బాధపడుతోందేమిటి?

అదే భరత్‌తో చెప్పాను.

మరో పదినిమిషాల తర్వాత "కంగ్రాట్స్‌య్... మీ గేదె గారు కవలల్ని ప్రసవించారు.." అన్నాడు భరత్.

నా హృదయం ఆనందంతో ఉరకలు వేసింది. రెండు పెయ్యదూడలు. నాలుగేళ్ళు కళ్ళు మూసుకుంటే చాలు రెండూ ఎదిగివస్తాయి. ఆ తర్వాత అంతా లాభమే!!

"అమ్మా..." అరుస్తూ పరిగెత్తాను. "మనగేదె ప్రసవించింది. రెండూ పెయ్యదూడలె..." అమ్మ చేతులు పట్టుకుని కుదిపేశాను.

ఉహూ... ఈ ఆనందాన్ని మరొకర్తో కూడా పంచుకోవాలి.

శ్రీముఖీ!!

"శ్రీముఖీ..." గబగబా ఆమె గదిలోకి నడిచాను. "శ్రీముఖీ శుభవార్త. మన గేదె రెండు పెయ్యదూడల్ని ప్రసవించింది..." అన్నాను ఉద్వేగంగా.

శ్రీముఖి నాకేసి చూస్తోంది. ఆ చూపుల్లో ముల్లోకాల్లో కూడా లేనంత కోపమూ జుగుప్సా ఉన్నాయి. కోపం కంటే అసహ్యమే ఎక్కువ పాళ్ళలో కన్పించింది. అందుకు నిదర్శనంగా ఆమె పెదవులూ ముక్కుపుటాలు అమితవేగంతో కంపిస్తున్నాయి. మరికాసేపుంటే ఫుల్ వాల్యూమ్‌లో 'గెటౌట్' అని అర్చేలా వుంది.

మౌనంగా బైటికి నడిచాను. శ్రీముఖికి అంతకోపం ఎందుకొచ్చిందో ఆలోచించే ప్రయత్నం చేస్తూ.